క్లుప్తంగా

యాదయ్య కుటుంబానికి అండగా ఉంటాం

కేశంపేట: తెలంగాణ ఉద్యమం నుంచి పార్టీలో కొనసాగిన సరికొండ యాదయ్య మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే ఎల్లనమోని అంజయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సరికొండ యాదయ్య అకాల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఎల్లనమోని అంజయ్యయాదవ్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యమ సమయం నుంచి పార్టీ కోసం చేసిన కృషిని గుర్తుచేశారు. పార్టీ యాదయ్య కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పర్వత్‌రెడ్డి, చెంద్రయ్య పాల్గొన్నారు.

బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా వెంకటేశ్

శంకర్‌పల్లి: బీసీ సంక్షేమ సంఘం చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామానికి చెందిన బండమీద వెంకటేశ్ నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి నియోజకవర్గ అధ్యక్ష పదవీ ఇచ్చిన ఆర్.కృష్ణయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీసీల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతానని, వారి సమస్యలను ఎప్పటికప్పుడూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యం, రవికుమార్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్



పూజలో పాల్గొన్న రవీందర్‌యాదవ్, నాయకులు, భక్తులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని మొగిలిగిద్దలో మంగళవారం ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో పాల్గొన్న ఆయన, పలువురు నాయకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఈట గణేష్, లక్ష్మణ్‌నాయక్, వీరేశంగుప్తా, రాయికల్ వెంకట్‌రెడ్డి, రవిగౌడ్, నగరం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్‌హెచ్‌పీఎస్ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కేశంపేట: లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) 29వ ఆవిర్భావ వేడుకలను మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌నాయక్, రామునాయక్, చందర్‌నాయక్, మోహన్‌నాయక్, అమోఘ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశుభ్రతకు చర్యలు



విద్యార్థులతో స్వచ్ఛ విద్యాలయ మండల కో-ఆర్డినేటర్ రాములు, ఉపాధ్యాయులు

షాబాద్: ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని స్వచ్ఛ విద్యాలయ మండల కో-ఆర్డినేటర్ రాములు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాచన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల డివిజన్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను శుభ్రం చేసేందుకు స్వచ్ఛభారత్ సచ్ఛ విద్యాలయ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పాఠశాలలో పరిశుభ్రత వాతావరణం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు మహేందర్, రామస్వామిగౌడ్ ఉన్నారు.

రాంగ్‌రూట్ ప్రయాణం.. ప్రాణాలతో చెలగాటం

నిబంధనలు అతిక్రమిస్తున్న స్కూల్ బస్సులు

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



రాంగ్‌రూట్‌లో వెళ్తున్న స్కూల్ బస్సులు

మొయినాబాద్: చిన్నతనం నుంచి విద్యార్థులకు క్రమశిక్షణ, మంచితనం, విద్యాబుద్ధులు నేర్పేది పాఠశాలే. కానీ ఆ పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్లే బస్సులు ప్రతీ రోజు రాంగ్‌రూట్‌లో వెళ్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఇది ప్రతి రోజు జరుగుతున్న తంతు. శ్రీ చైతన్య స్కూల్ బస్సులు ఉదయం విద్యార్థులను పాఠశాలకు తీసుకొచ్చే సమయంలో రాంగ్‌రూట్‌లో వెళ్తున్నాయి. హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, ఎన్కేపల్లి, అమ్డాపూర్ ప్రాంతాల నుంచి వచ్చే స్కూల్ బస్సులు పాఠశాలకు వెళ్లాలంటే మొయినాబాద్ ప్రధాన చౌరస్తాలో యూటర్న్ తీసుకొని వెళ్లాల్సి ఉంటుంది. కానీ డ్రైవర్లు ప్రధాన చౌరస్తాకు వెళ్లకుండా పెట్రోల్ బంక్ వద్ద నుంచి రైట్ సైడ్ రోడ్‌లోకి బస్సులు మళ్లించి కొంత దూరం రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు. మొయినాబాద్ నుంచి నగరం వైపు వెళ్లే వాహనాలకు స్కూల్ బస్సులు ఎదురు వెళ్లడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు వేగంగా వస్తే ప్రమాదాలు సైతం జరిగే అవకాశం ఉంది. ఇలా స్కూల్ బస్సులను రాంగ్‌రూట్‌లో నడిపి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న డ్రైవర్లు, స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఆరంభంలోనే మొరాయింపు

స్కూళ్లు మొదలవగానే స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ చేయిస్తారు. అన్ని సరిగా ఉన్నాయా.. లేవా అని ఆర్టీఏ అధికారులు తనిఖీ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తారు. స్కూల్స్ మొదలై ఇరవై రోజులు కాకముందే మొయినాబాద్‌లోని శ్రీ చైతన్య స్కూల్ బస్సులు మొరాయిస్తున్నాయి. మరి వీటికి ఆర్టీఏ అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఎలా ఇచ్చారో వారికే తెలియాలి. మంగళవారం శ్రీ చైతన్య స్కూల్ బస్సు రోడ్డుపైనే మొరాయించింది. దీంతో మరో స్కూల్ బస్సుకు టోషన్ కట్టి స్కూల్ వద్దకు తీసుకెళ్లారు. టోషన్‌తో కూడా రాంగ్‌రూట్‌లో వెళ్లడం గమనార్హం.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి



ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ రమాదేవి

ఏడీఏ రమాదేవి

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ప్రతీ రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏడీఏ రమాదేవి సూచించారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఏడీఏ రమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలనే ఆలోచనతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టడుతున్నామన్నారు. దీనిలో భూమి ఉన్న ప్రతీ రైతుకు భూములకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారాన్ని పొందుపరస్తామన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలను రైతు ఆధార్‌కార్డుకు అనుసంధానం చేసి ఫార్మర్ ఐడీని కేటాయిస్తారన్నారు. పీఎం కిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడత లబ్ధి పొందేందుకు ప్రమాణికంగా ఫార్మా రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. ఫార్మర్ ఐడీని పొందుటకు ఆధార్‌కార్డు, భూ యాజమాన్య పాస్‌పుస్తకం, ఆధార్‌కు లింకు చేయబడిన మొబైల్ నంబర్‌ను తీసుకొని మీ సమీపంలోని వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు నిషాంత్‌కుమార్, తేజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై కంది విత్తనాలు

మండల వ్యవసాయాధికారి అనురాధ



రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న అనురాధ

మొయినాబాద్: ఎస్ఎఫ్ఎస్ఎం పథకంలో భాగంగా రైతులకు వంద శాతం సబ్సిడీపై కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నామని మండల వ్యవసాయాధికారి అనురాధ తెలిపారు. మంగళవారం మొయినాబాద్ రైతు వేదికలో కొంత మంది రైతులకు కంది విత్తనాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎల్ఆర్‌జీ-52 రకం కంది విత్తనాలు వర్షాధారిత ప్రాంతాల్లో అధిక దిగుబడులు ఇస్తాయన్నారు. ఎకరాకు 4 కిలోల విత్తనాలు వేసుకోవచ్చని.. 155-160 రోజులలో పంట చేతికొస్తుందని తెలిపారు. ఎకరాకు 8-9 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. విత్తనాలు అవసరమున్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకొని రైతువేదికకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సునీల్ కుమార్, రైతులు వెంకటేశ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య సభ్యులకు సన్మానం



సమాఖ్య సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సభ్యులకు ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. మండల సమాఖ్య, గ్రామ సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, కార్యదర్శి సులోచన, కోశాధికారి అలివేలు, మాజీ అధ్యక్షురాలు అనురాధ, మాజీ కోశాధికారి చంద్రమణి, ఏపీఎం నగేశ్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని వినతి

నందిగామ: కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ జంగోనిగూడ పృథ్వీకాలనీకి చెందిన పలువురు కాలనీవాసులు మంగళవారం స్థానిక ట్రాన్స్‌కో ఏఈ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. కాలనీలో ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, మళ్లీ ఎప్పుడో వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. రాత్రిళ్లు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందంటే చాలూ ఉదయం వరకు విద్యుత్‌ను పునరుద్ధరించే వారే లేరన్నారు. సమస్యను సత్వరమే పరిష్కరించాలని, అవసరమైతే ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



అంగన్‌వాడీ ఆయాతో మాట్లాడుతున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయాతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలోని బండలు పగిలిపోవడంతో పంది కొక్కులు, ఎలుకలు వస్తున్నాయని, పిల్లలు కూర్చునేందుకు వీలులేకుండా ప్రమాదకరంగా మారినా పట్టించుకునే నాథుడే లేరని మండిపడ్డారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నాయకులు, అధికారులు శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. భవనం ఎప్పుడు కూలుతుందో, ఏం ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని వాపోయారు. గతంలో ఎమ్మెల్యే సందర్శించి ఇక్కడి పరిస్థితి తెలుసుకున్నారని, సొంత నిధులతో అంగన్‌వాడీ కేంద్రంలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ఎమ్మెల్యే సుముఖంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్ బాబర్, నాయకులు రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, ఎండీ.ఇబ్రహీం, అందె మోహన్, కృష్ణారెడ్డి, అగ్గనూరు బస్వం, ముబారక్‌అలీ, మురళీమోహన్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల బంద్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు

చేవెళ్ల: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో 2, 3, 4 తేదీలలో చేపట్టిన కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల వద్ద మంగళవారం నాయకులు, విద్యార్థులతో కలిసి ఆయన కళాశాలల బంద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నాయని మండిపడ్డారు. కళాశాలల బంద్‌కు యాజమాన్యాలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య అందరి హక్కు

ఎంఈఓ చంద్రశేఖర్

కేశంపేట: ప్రాథమిక విద్య అందరి హక్కు అని మండల విద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం ఉల్లాస్‌పై వీఓఏలకు ఒక్క రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. గ్రామాల్లో మహిళా సమాఖ్యల ద్వారా నిరాక్షరాస్యులను గుర్తించాలన్నారు. అదేవిధంగా వాలెంటర్ టీచర్లను గుర్తించాలని, వారు గ్రామాల్లో 100 గంటల విద్యను నిరాక్షరాస్యులకు బోధించాల్సి ఉంటుందని తెలిపారు. ఇలా విద్య నేర్చుకున్న వారికి ఓపెన్ టెస్ట్ ద్వారా పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశం ప్రభుత్వం కల్పించిందని, టెస్ట్ పాస్ అయిన వారికి ఇంటర్మీడియట్ చేసే అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. 15 సంవత్సరాల నుంచి 50 ఏళ్లలోపు వారిని గుర్తించి ప్రాథమిక విద్యను బోధించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం భగవంతు, రిసోర్స్ పర్సన్ శరతచంద్ర, సీసీలు రాంచంద్రయ్య, మల్లేశ్, యాదయ్య, నర్సింహ, తిరుపతమ్మ, అకౌంటెంట్ కవిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

తడి, పొడి చెత్తను వేరుచేయాలి

మున్సిపల్ కమిషనర్ యోగేశ్

శంకర్‌పల్లి: మున్సిపల్ ప్రజలందరూ ఇంట్లోనే తడి, పొడి చెత్తను వేరు చేసి సిబ్బందికి అందించాలని కమిషనర్ యోగేశ్ సూచించారు. మంగళవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణ శివారులోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇళ్లలోనే తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్త ఆటోల్లో వేయాలన్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడకం తగ్గించి, పర్యావరణ సమతుల్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.

డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు

మత్తు పదార్థాలకు బానిసై తమ బంగారు జీవితాన్ని పాడు చేసుకోవద్దని సీఐ శ్రీనివాస్‌గౌడ్ ప్రజలకు సూచించారు. డబుల్ బెడ్రూం ఇళ్లలో నివాసం ఉండే వారికి డ్రగ్స్ వాడకం, దానితో కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. "సే నో టూ డ్రగ్స్" పేరుతో రూపొందించిన వాల్ పోస్టర్‌ని మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌తో కలిసి సీఐ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డబుల్ బెడ్రూం ఏఈ రామకృష్ణ, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యులు..దేవుళ్లతో సమానం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: వైద్యులు దేవుళ్లతో సమానం అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. డాక్టర్స్ డేను పురస్కరించుకొని మంగళవారం పట్టణంలో లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో బుగ్గారెడ్డి గార్డెన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మానవ మనుగడలో వైద్యుల పాత్ర మరువలేనిదన్నారు. ప్రజారోగ్యం కోసం అనునిత్యం వైద్యులు ఎంతో కృషి చేస్తుంటారన్నారు. సమాజంలో వైద్య వృత్తికి ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. ప్రజలు వైద్యులను ప్రత్యక్ష దైవాలుగా భావిస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వైద్య వృత్తిని అంకితభావంతో నిర్వహించాలన్నారు. వైద్యులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మదన్‌మోహన్‌రెడ్డి, చెంది మహేందర్‌రెడ్డి, శరత్‌చంద్రబాబు, శివనాగయ్య, సుధాకర్, వైద్యులు బండారు రమేష్, అనురాగ్‌రెడ్డి, నాయకులు బాబర్‌ఖాన్, విశ్వం, తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, ఇబ్రహీం, రఘునాయక్, కృష్ణ, సుదర్శన్, సీతారాం, శ్రీకాంత్‌గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎత్‌బార్‌పల్లి గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: మాకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి.. ఇళ్లు కట్టుకోవడానికి స్థలం లేదు.. గ్రామంలో ఇళ్ల స్థలాల కోసం గతంలో కేటాయించిన భూమిలో ఇళ్లు కట్టుకుంటాం. మాకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ పట్టాలు ఇవ్వండి సారూ అంటూ ఎత్‌బార్‌పల్లి గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. మండల పరిధిలోని ఎత్‌బార్‌పల్లి గ్రామస్తులు బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 14/2లో 3.37 ఎకరాల భూమిని గతంలో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఇళ్ల స్థలాలకు కేటాయించిందని.. అప్పట్లో 25 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు సర్వే నంబర్ 14/2లో ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు తెలిపారు.

పనిచేసిన వారికే పదవులు

బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి



మాట్లాడుతున్న అనంత్‌రెడ్డి

చేవెళ్ల: బీజేపీలో కిందిస్థాయి నుంచి పార్టీని నమ్ముకొని పనిచేసే వారికే పదవులు వస్తాయని చెప్పటానికి నిదర్శనమే రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక అని మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు ఎన్నికపై హర్షం వ్యక్తం చేశారు. పార్టీలో గత 40 ఏళ్లుగా ఉంటూ ఎన్నో విధాలుగా పార్టీకి సేవలందించిన వ్యక్తి రామచంద్రరావు అన్నారు. అలాంటి వ్యక్తిని రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక చేయటం పార్టీకి మరింత బలాన్ని ఇస్తుందన్నారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కలిసి పనిచేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచంద్రరావుకు మున్సిపాలిటీ తరఫున శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ దేవుని శర్వలింగం, నాయకులు అంజనేయులుగౌడ్, శివశంకర్, శ్రీకాంత్‌రెడ్డి, అశోక్, చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



బహుమతులు అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

షాబాద్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమవంతు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎలుగంటి వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కుమ్మరి చెన్నయ్య అన్నారు. మండల కేంద్రంలోని పీఆర్ఆర్ స్టేడియంలో ఏఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా కొనసాగిన ఎస్‌పీఎల్-3 క్రికెట్ మ్యాచ్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంజీవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అశోక్, సీనియర్ నాయకులు రాహుల్‌గుప్తా, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్



చేవెళ్ల: మెడికల్ ఆఫీసర్‌కు సమ్మె నోటీస్ అందిస్తున్న దేవేందర్, ఆశ కార్యకర్తలు

చేవెళ్ల: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 9న చేపడుతున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ కోరారు. మండలంలోని ఆలూరు పీహెచ్‌సీలో మంగళవారం మెడికల్ ఆఫీసర్‌కు ఆశవర్కర్ల యూనియన్‌తో కలిసి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు వత్తాసు పలుకుతూ కార్మికులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ఆశవర్కర్ల యూనియన్ నాయకులు అన్నపూర్ణ, విజయలక్ష్మీ, శాంత, గీత, హేమలత, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

షాబాద్: మండల పరిధిలోని చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రలో మంగళవారం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ఆధ్వర్యంలో ఆశకార్యకర్తలు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశకార్యకర్తలు తదితరులు ఉన్నారు.

మండల వైద్యాధికారికి..

కేశంపేట: మండల కేంద్రంలో సీఐటీయూ మండల కన్వీనర్ బేరి శ్రీనివాస్ ఆశకార్యకర్తలతో కలిసి మండల వైద్యాధికారి డాక్టర్ నిఖితకు సార్వత్రిక సమ్మె నోటీసును అందించారు. కార్యక్రమంలో ఆశకార్యకర్తలు సుజాత, వసంత, శ్రీలత, రాజేశ్వరి, స్వప్న, అనురాధ, సంతోషి, నిర్మల, రాణి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా..

శంకర్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 9న చేపడుతున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నోటీసును మంగళవారం ఆశవర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు నాగమణి, కార్యదర్శి భవానీ కలిసి పీహెచ్‌సీ డా.రేవతి రెడ్డికి అందించారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని, లేకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.